హైదరాబాద్ రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మణికొండలో ఆదివారం మంత్రి హరీశ్‌రావు హాజరైన బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాదసభకు భారీగా తరలివచ్చిన ప్రజలు

కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ జనరేటర్లు

- హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కుప్పకూలిపోతుంది
- ఇక్కడ కర్ఫ్యూ, పల్లెల్లో కరువొస్తది
- ఆ పార్టీది గతి, సుతిలేని సంసారం
- వాళ్ల పాలనలో పైసలన్నీ జేబుల్లోకి
- ఇప్పుడు పథకాలుగా ప్రజలకు
- కరెంటు కష్టాలు తీర్చింది కేసీఆర్
- కన్న కొడుకులు చూడకున్నా భరోసా కల్పిస్తున్న సీఎం కేసీఆర్
- రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మణికొండ, దుబ్బాక ప్రజాఆశీర్వాద సభల్లో మంత్రి హరీశ్‌రావు

మణికొండ ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో ప్రకాశ్‌గౌడ్

మణికొండ, దుబ్బాక, నవంబర్ 26: గత కాంగ్రెస్ పాలనలో నిత్యం కరెంటు కోతలు ఉండేవని, ప్రతి దుకాణం ముందు మూసినా జనరేటర్లే కనిపించేవని, ఆ పార్టీకి ఓటేస్తే మళ్లీ ఆ పరిస్థితే వస్తుందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలిత కర్ణాటక నిత్యం కరెంటు కోతలతో సతమతమవుతున్నదని చెప్పారు. కానీ, కేసీఆర్ 24 గంటల కరెంట్, ఉచిత నీళ్లు ఇచ్చారని తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం మణికొండ, దుబ్బాకలో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న హరీశ్ మాట్లాడుతూ.. కేసీఆర్ నేతృత్వంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని వెల్లడించారు. గతంలో మంచినీళ్లకు ఇబ్బంది పడేవారని, అపార్ట్‌మెంట్లలో ఉండేవాళ్లు డబ్బులిచ్చి నీళ్ల ట్యాంకర్లను తెచ్చుకొనే దుస్థితి ఉండేదని గుర్తుచేశారు. జలమండలి దగ్గర ధర్నాలు చేసేవాళ్లని అన్నారు. కానీ రాష్ట్రం వచ్చాక నల్లాబిల్లు మాఫీ చేసిన ఘనత కేసీఆర్‌దేనని వివరించారు. నీళ్ల కష్టం తీర్చిన నాయకుడు కేసీఆర్ అని గుర్తు పెట్టుకోవాలని మహిళలను కోరారు.

> కేసీఆర్ పాలనలో గ్రామాల్లో కరువు లేదు. హైదరాబాద్‌లో కర్ఫ్యూ లేదు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరువు, కర్ఫ్యూ రెండూ వస్తాయి.
>
> ప్రతిపక్షాల అభిష్టానం ఢిల్లీలోనే ఉంటుంది. ఇప్పుడు అక్కడి కాలుష్యం తెలంగాణకు చేరింది. మూడు రోజులు భరిస్తే ఆ శబ్ద కాలుష్యం మళ్లీ ఢిల్లీకే పోతుంది. లోకల్‌గా ప్రజల కోసం ఉండేది కేసీఆరే. కారు గుర్తుకు ఓటేసి హ్యాట్రిక్ సీఎంను చేసుకుందాం.
>
> - మంత్రి హరీశ్‌రావు

కర్ణాటక మాడల్ అంటే కరెంటు కోతలా?

కర్ణాటక మాడల్ అంటూ కాంగ్రెసోళ్లు ఊదరగొడుతున్నారని, అంటే తెలంగాణలో కరెంటు కోతలు పెడతారా? మంచినీళ్లు కట్ చేస్తారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బెంగళూరులో రోడ్లు బాగోలేక ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని విమర్శించారు. ఆ పార్టీకి ఓటేస్తే రియల్ ఎస్టేట్ కుప్పకూలుతుందని హెచ్చరించారు. బెంగళూరులో గజానికి రూ.80 లంచం ఇస్తేనే పర్మిషన్ వస్తుందని, ఆ పరిస్థితి హైదరాబాద్‌కు తెచ్చుకుందామా? అని ప్రజలను అడిగారు. రాహుల్‌గాంధీకి దమ్ముంటే బెంగళూరులో నిరుద్యోగులతో మీటింగ్ పెట్టగలరా? అని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ పాలనలో ఇసుక ఆదాయం రూ.5 కోట్లు మాత్రమే వచ్చిందని, కేసీఆర్ వచ్చాక అది రూ.5 వేల కోట్లకు చేరిందని వివరించారు. హస్తం పార్టీ పాలనలో డబ్బంతా వారి జేబుల్లోకే వెళ్లిందని, కేసీఆర్ పాలనలో సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు చేరిందని తెలిపారు. కాంగ్రెస్‌ది గతి, సుతిలేని సంసారమని, ఆ పార్టీని నమ్మి మోసపోవద్దని ప్రజలకు హితవు చెప్పారు. 'రిస్క్ వద్దు.. కారుకే ఓటు గుద్దు' అని పిలుపునిచ్చారు. తెలంగాణ వచ్చాక హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తీర్చామని తెలిపారు. సీసీకెమెరాలతో, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో శాంతిభద్రతలు కాపాడుకుంటున్నామని వివరించారు. కన్న కొడుకులు పట్టించుకోకపోయినా తాను ఉన్నానన్న భరోసా కేసీఆర్ కల్పించారని స్పష్టం చేశారు. మూడోసారి గెలిచాక మూడు కొత్త వరాలు వస్తున్నాయని, సౌభాగ్యలక్ష్మి, రూ.400 గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం వంటి పథకాలు రాబోతున్నాయని చెప్పారు. రైతుబంధు పడుతుందంటే కాంగ్రెస్ గుండెలు జారుతున్నాయని, సంపద పెంచి పేదలకు పంచటమే కేసీఆర్ విధానమని పేర్కొన్నారు. 11 సార్లు చాన్స్ ఇస్తే కనీసం మంచినీళ్లు ఇవ్వలేని పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. కటక వేస్తే వచ్చే కరెంట్ కావాల్నా? కటిక చీకటి కర్ణాటక తరహా కరెంట్ కావాల్నా? అన్నది ప్రజలు ఆలోచించాలని కోరారు.

హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటూ రాదు

హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాదని మంత్రి హరీశ్ అన్నారు. మూడు సార్లు గెలిచిన ప్రకాశ్‌గౌడ్ సాదాసీదాగా ఉంటారని, గర్వం అనేదే ఉండదని చెప్పారు. ఆయనను మళ్లీ గెలిపిస్తే మణికొండకు 100 పడకల దవాఖాన మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీతో కోట్లాడే సామర్థ్యం బీఆర్ఎస్‌కే ఉన్నదని స్పష్టం చేశారు. ఆటోల ఫిట్‌నెస్ చార్జీలు రద్దు చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ పదేండ్లలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని వెల్లడించారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని, ఆలోచించి కారు గుర్తుకే ఓటువేయాలని అభ్యర్థించారు. మణికొండ సభలో మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ సమన్వయకర్త తలారి మల్లేశ్ ముదిరాజ్, ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి, శంషాబాద్ జడ్పీటీసీ తన్వీరాజు, వైస్‌చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, బండ్లగూడ మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు మద్దతుగా హైకోర్టు న్యాయవాదుల ప్రచారం

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న తెలంగాణ హైకోర్టు న్యాయవాదులు

గజ్వేల్ అర్బన్, నవంబర్ 26: సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ఆదివారం పలువురు హైకోర్టు న్యాయవాదులు ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం వైష్ణవి గార్డెన్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ హైకోర్టు న్యాయవాదులు, బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకుడు కొట్టాల యాదగిరి, ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడు గోపధన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌లో సీఎం లకే గ్యారెంటీ లేదని, ఇక ఆరు గ్యారెంటీలకు దేవుడే దిక్కని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలతో తెలంగాణ ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు కష్టాలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఎంతోమంది పంటలు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో 24 గంటల ఉచిత విద్యుత్తుతోపాటు పుష్కలంగా సాగునీరు అందుతున్నదని వివరించారు. తద్వారా బంగారు పంటలు పండుతున్నాయని తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో పర్యటించామని, ప్రజలంతా కేసీఆర్‌నే కోరుకుంటున్నారని చెప్పారు. కరోనా సమయంలో కోర్టులు పనిచేయక.. కేసులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న న్యాయవాదులను కేసీఆర్ ఆదుకున్నారని గుర్తు చేశారు. న్యాయవాదులకు ఒక్కొక్కరికి రూ.16 వేల ఆర్థిక సహాయం అందించి న్యాయవాదులకు మనోధైర్యం కల్పించారని, సంరక్షణ కోసం వెల్ఫేర్ ఫండ్ రూ.100 కోట్లు కేటాయించి ఇన్సూరెన్స్ చేసిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి పాతూరి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆత్మకమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గుల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దిగజారుతున్న రాజ్యాంగ విలువలు

- ప్రతిపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ, నవంబర్ 25: దేశంలో రాజ్యాంగ విలువలు రోజురోజుకూ దిగజారుతున్నాయని, వాటి పరిరక్షణలో అధికార బీజేపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని పలువురు విపక్ష నేతలు విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కాంగ్రెస్ సహా పలు పార్టీల నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను, వృత్తి సంబంధ స్వయంప్రతిపత్తిని మోదీ ప్రభుత్వం పూర్తిగా తుడిచిపెట్టేసిందని, అంతేకాకుండా రాజ్యాంగాన్ని తిరగరాయాలని వాదిస్తున్నదని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ విమర్శించారు. విభజన, విద్వేషంపై కాంగ్రెస్ ముందుండి పోరాడుతుందని పీసీసీ చీఫ్ ఖర్గే తెలిపారు. ప్రజాస్వామ్య మూలాలపై దాడి చేస్తూ దానిని బలహీనపర్చడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఆప్ నేత గోపాల్ రాజ్ విమర్శించారు. దేశంలో ఏకపార్టీ విధానం వైపు తీసుకెళ్లడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు. రాజ్యాంగం గొప్పతనం గురించి బీజేపీ ఒక్క రోజు మాత్రమే మాట్లాడుతుందని, మిగిలిన ఏడాదంతా దానిని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తూనే ఉంటుందని శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది విమర్శించారు.

ఎల్లుండి పోలింగ్ సామగ్రి పంపిణీ

- రాష్ట్రంలో 12 వేల సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్
- ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న 2.50 లక్షల మంది సిబ్బంది
- ఇప్పటికే ఓటేసిన 1.23 లక్షల మంది
- దివ్యాంగుల కోసం 18 వేల వీల్‌చైర్లు
- ఏకే గోయల్ ఇంట్లో ఏమీ దొరకలేదు
- సీఈవో వికాస్‌రాజ్ వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఈ నెల 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు సీఈవో వికాస్‌రాజ్ తెలిపారు. ఈ నెల 29న డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా పోలింగ్ సామగ్రిని పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఆదివారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 12 వేల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఆయా కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ఒకే చోట ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉంటే బయట కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్నికల విధుల్లో అన్ని విభాగాల నుంచి మొత్తం 2.50 లక్షల మంది సిబ్బంది పాల్గొంటున్నారని, మైక్రో అబ్జర్వర్లుగా 22 వేల మందిని నియమించామని వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు విధుల్లో 45 వేల మంది తెలంగాణ పోలీసులు, ఇతర రాష్ట్రాలకు చెందిన 23,500 మంది హోంగార్డులు పాల్గొంటారని తెలిపారు. వీరితోపాటు 3 వేల మంది తెలంగాణ ఎక్సైజ్, అటవీశాఖ సిబ్బంది, 50 కంపెనీల టీఎస్ఎస్పీ సిబ్బంది, 375 కంపెనీల కేంద్ర బలగాలను వినియోగిస్తామని వివరించారు.

ఏకే గోయల్ ఇంట్లో ఏమీ దొరకలేదు

మాజీ ఐఏఎస్ అధికారి ఏకే గోయల్ నివాసంలో నిర్వహించిన తనిఖీల్లో ఏమీ లభ్యం కాలేదని ప్రాథమిక నివేదికలో వెల్లడైందని వికాస్‌రాజ్ వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.709 కోట్ల విలువైన వస్తువులు, నగదు, మద్యం, ఇతర సామగ్రిని సీజ్ చేశామని తెలిపారు.

దివ్యాంగులకు ఉచిత రవాణా

రాష్ట్రంలో ఇప్పటివరకు 54.39 లక్షల ఓటరు కార్డులను ముద్రించామని, మిగిలిన వాటి పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద 18 వేల వీల్‌చైర్‌లను ఏర్పాటు చేశామని, రిటర్నింగ్ అధికారి ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తారని చెప్పారు.

ఓటేసిన 96 వేల మంది ఉద్యోగులు

ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్లు, హోం ఓటింగ్ ద్వారా 1,23,186 ఓటు హక్కు వినియోగించుకున్నారని వికాస్‌రాజ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ విధుల్లో ఉన్న 1,68,612 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటికే 96,526 మంది ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఇంకా ఓటింగ్‌కు అవకాశం ఉన్నదని చెప్పారు. విధుల్లో ఉన్న ఉద్యోగులు 2018 ఎన్నికల్లో 1,00,135 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. సాధారణ ఎన్నికల్లో మొదటిసారిగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్ పూర్తి అయిందని, 26,660 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు.

పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేక టేబుళ్లు

ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా ఉన్నందున వీటి లెక్కింపునకు ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, ప్రతి 500 పోస్టల్ ఓట్లకు ఒక టేబుల్ ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ఇవి ఈవీఎం ఓట్ల లెక్కింపు టేబుల్స్‌కు అదనమని స్పష్టంచేశారు. రాష్ట్రంలో 41 కేంద్రాల్లో 119 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. రంగారెడ్డి జిల్లాలో 4, హైదరాబాద్‌లో 14 ప్రాంతాల్లో లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశామని, 31 జిల్లాల్లో కౌంటింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ ఫిర్యాదులపై స్పందించామని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవో సత్యవాణి పాల్గొన్నారు.

హోం ఓటింగ్ వినియోగించుకున్నవారు

80 ఏండ్లకు పైబడినవారు	15,879 మంది
దివ్యాంగులు	9,374 మంది
అత్యవసర శాఖల సిబ్బంది	1,407 మంది

ఇప్పటివరకు సీజ్ చేసిన మొత్తం విలువ	రూ.709 కోట్లు
నగదు	రూ.282 కోట్లు
మద్యం విలువ	రూ.118 కోట్లు
ఇతర వస్తువులు, ఉచిత బహుమతులు	రూ.83 కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా నమోదైన కేసులు

నగదు రవాణా	97
మద్యం	10,325
ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు	1,020
పెయిడ్ న్యూస్	37
తొలగించిన సోషల్‌మీడియా లింక్‌లు	120

బరిలో ఉన్న అభ్యర్థులు

మొత్తం అభ్యర్థులు **2,290**

పురుషులు **2,068**

మహిళలు **221**

ట్రాన్స్‌జెండర్ **1**

పోలీసులమని బెదిరించి లైంగిక దాడి

- మధ్యప్రదేశ్‌లో ఘోరం

అశోక్‌నగర్, నవంబర్ 26: పోలీసులమని బెదిరించిన ఇద్దరు వ్యక్తులు రైల్వేస్టేషన్‌లో ఒక మహిళపై సామూహిక లైంగిక దాడి జరిపిన సంఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. శుక్రవారంరాత్రి అశోక్‌నగర్ జిల్లా, ముంగ్వాలీ రైల్వేస్టేషన్‌లో జైపూర్ వెళ్లేందుకు 30 ఏండ్ల మహిళ తన భర్తతో రైలు కోసం ఎదురు చూస్తున్నది. ఆ సమయంలో అక్కడకు సివిల్ దుస్తుల్లో వచ్చిన ఇద్దరు వ్యక్తులు తాము పోలీసులమని చెప్పి బెదిరించారు. వారిలో ఒక వ్యక్తి ఆమె భర్తను కొట్టి పక్కకు తీసుకెళ్లగా రెండో వ్యక్తి ఆమెపై లైంగిక దాడి చేశాడు. తర్వాత రెండో వ్యక్తి కూడా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో యువతికి బ్రెయిన్‌డెడ్

- అవయవాలను దానం చేసిన కుటుంబసభ్యులు
- ఐదుగురికి పునర్జన్మ ప్రసాదించిన వీఆర్వో

హైదరాబాద్,నవంబర్26(నమస్తే తెలంగాణ): ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువతి తాను చనిపోతూ ఐదుగురికి పునర్జన్మనిచ్చింది. అవయవదానం ద్వారా వారి కుటుంబాల్లో వెలుగులు నింపింది. ఎచ్చెర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బొడిగి మౌనిక శ్రీకాకుళం పట్టణంలోని ఓ సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 22న మౌనిక బైక్‌పై వెళ్తుండగా రోడ్డుప్రమాదం జరిగి ఆమె తలకు బలమైన గాయమైంది. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అప్పటికే ఆమె బ్రెయిన్‌డెడ్ అయినట్టు డాక్టర్లు నిర్ధారించారు. దీంతో ఆమెను శ్రీకాకుళంలోని జెమ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అవయవదానంపై అక్కడి సిబ్బంది మౌనిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో వారు ముందుకొచ్చారు. మౌనిక అవయవాలను గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి కొద్దిగంటల వ్యవధిలోనే తరలించారు. మౌనిక గుండెను రోడ్డు మార్గం ద్వారా విశాఖపట్నం తరలించి, అక్కడి నుంచి విమానంలో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. ఒక కిడ్నీని అదే దవాఖానలోని ఓ రోగికి అమర్చగా, మరో కిడ్నీని విశాఖలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. రెండు కండ్లను రెడ్‌క్రాస్ సంస్థకు అందించారు.

'పార్లమెంట్‌పై ఆ రెండు వ్యవస్థలు జోక్యం చేసుకోలేవు'



న్యూఢిల్లీ, నవంబర్ 26: రాజ్యాంగ ఏకైక నిర్మాతగా పార్లమెంట్ ఆధిపత్యం ప్రశ్నించలేనిదని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అన్నారు. పార్లమెంట్ అధికారాలపై న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు జోక్యం చేసుకోలేవని పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ధన్‌కర్ మాట్లాడుతూ దేశ నిరంతర అభివృద్ధి కోసం కార్యనిర్వాహక, న్యాయ, శాసన వ్యవస్థలు సహకారంతో పనిచేయాలని, ఘర్షణాత్మక రూపంలో కాదని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు పార్లమెంట్ చట్టాన్ని రూపొందించలేదని, అదే విధంగా సుప్రీంకోర్టుకు శాసన వ్యవస్థ తీర్పులు రాసివ్వలేదని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సార్వభౌమాధికారం దేశ సార్వభౌమాధికారానికి పర్యాయ పదమని, అది అజేయమని ధన్‌కర్ అన్నారు. పార్లమెంట్ ప్రత్యేక పరిధిలోకి చొరబడటం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని.. ప్రజాస్వామ్య సారాంశం, విలువలకు అది విరుద్ధమని పేర్కొన్నారు. కార్యనిర్వాహక, న్యాయ, శాసన వ్యవస్థలు తమ పరిధిలోనే పని చేయాలని రాజ్యాంగం నిర్దేశిస్తున్నదని ధన్‌కర్ ఈ సందర్భంగా అన్నారు.

పాల ఉత్పత్తిలో 22.81 శాతం వృద్ధి

గువాహటి, నవంబర్ 26: దేశంలో గత ఐదేండ్లలో పాల ఉత్పత్తి 22.81 శాతం పెరిగిందని, మొత్తం ఉత్పత్తిలో 15.72 శాతంతో ఉత్తరప్రదేశ్ మిగిలిన రాష్ట్రాల కన్నా ముందంజలో ఉందని కేంద్ర మత్స్య, పశు, డెయిరీ శాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాల వెల్లడించారు. జాతీయ పాల దినోత్సవాన్ని పురస్కరించుకుని గువాహటిలో ఆయన 2022-23 ఆర్థిక సంవత్సరంలో తమ శాఖకు సంబంధించిన వివరాలను విడుదల చేశారు. 2022-23 సంవత్సరానికి దేశంలో పాల ఉత్పత్తిని 230.58 మిలియన్ టన్నులు అంచనా వేశామన్నారు. అయితే 2018-19 నుంచి చూస్తే గత ఐదేండ్లలో 22.81 శాతం వృద్ధిని సాధించిందన్నారు. గుడ్ల ఉత్పత్తిలో గత ఐదేండ్లలో 33.1 శాతం, మాంసం ఉత్పత్తిలో 20.39 శాతం, ఉన్ని ఉత్పత్తిలో 16.84 శాతం వృద్ధిని నమోదు చేసినట్టు మంత్రి తెలిపారు.

విద్యార్థిని చితకబాది.. ముఖంపై మూత్రం పోసి..

- యూపీలో దారుణ ఘటన

మీరట్, నవంబర్ 26: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణ ఘటన చోటుచేసుకొన్నది. మీరట్ జిల్లా మొహల్లా జాగృతి విహార్‌లో కొంత మంది దుర్మార్గులు ఓ 12 తరగతి విద్యార్థిని చితకబాది, ఆపై బాధితుడి ముఖంపై మూత్రం పోసి వికృతంగా ప్రవర్తించారు. నిందితులు ఈ దారుణాన్ని వీడియో కూడా తీశారు. ఇటీవలే ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నిందితులు బాధిత విద్యార్థి తల, వెనుక భాగంపై పదేపదే తన్నారు. తనను వదిలేయాలని బాధితుడు వేడుకొన్నా.. కనికరించకుండా అమానవీయంగా ప్రవర్తించారు. అనంతరం విద్యార్థి ముఖంపై మూత్రం పోసి దుర్మార్గంగా వ్యవహరించారు. వీడియోలను వైరల్ చేస్తామని బెదిరించి అతని నుంచి డబ్బులు కూడా గుంజుకొన్నారు. మీరట్ పోలీసులు విచారిస్తున్నారు.